


## కూల్చివేతలు చట్టానికి లోబడే ఉండాలి

- గాయత్రి, అనురాగ్, నీలిమ విద్యా సంస్థల నిర్మాణాల కేసులో హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ,అనురాగ్ యూనివర్సిటీ నిర్మాణాలను తొలగించేందుకు చేపట్టే చర్యలు నిబంధనలకు లోబడే ఉండాలని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆయా విద్యా సంస్థలు చూపే ఆధారాలను లోతుగా పరిశీలించాలని, చెరువులో ఉన్నట్టు నిర్ధారణ అయ్యాకే నిర్మాణాలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, అనురాగ్ యూనివర్సిటీ, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ టీ వినోద్‌కుమార్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు.భూములపత్రాలు, వివరాలను అందజేశాక వాటిని పరిశీలించి వివరణ ఇచ్చేందుకు కనీసం వారం రోజులు గడువు ఉండేలా చూడాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. దీనిపై ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. నాదం చెరువుకు సంబంధించిన సర్వే మ్యాప్‌ను పరిశీలించాలని హైకోర్టును కోరారు. 1951-54 కాస్రా పహాణీ ప్రకారం.. 61 ఎకరాల విస్తీర్ణంలో చెరువు, అక్కడి నుంచి 30 మీటర్ల మేరకు బఫర్‌జోన్ ఉన్నదని, పిటిషనర్ల నిర్మాణాలు ఈ బఫర్‌జోన్‌లోనే ఉన్నాయని తెలిపారు. చట్టానికి లోబడే చర్యలు చేపడతామని, ఆక్రమణల నిర్ధారణకు సంబంధించిన పత్రాలను పిటిషనర్లకు అందజేశాకే తదుపరి చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈలోగా పిటిషనర్లు ఇతర నిర్మాణాలు చేపట్టకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఎప్పుడో 1970 నాటి సర్వేలపై ఆధారపడటం కంటే సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల ఆధారంగా చెరువు విస్తీర్ణాన్ని నిర్ధారిస్తే బాగుటుందని పేర్కొన్నారు. విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చే వరకు ఆక్రమణల తొలగింపులు ఉండవని చెప్తున్నప్పుడు చెరువు విస్తీర్ణాన్ని సర్వే ఆఫ్ ఇండియా ఎస్‌ఆర్‌ఎల్సీ మ్యాప్‌ల ఆధారంగా నిర్ధారిస్తేనే బాటుందని అభిప్రాయపడుతూ.. ఈ పిటిషన్లపై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

### స్పోర్ట్స్ వెంచర్ కూల్చివేత బాధాకరం: పల్లంరాజు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తన సోదరుడి స్పోర్ట్స్ వెంచర్‌ను అక్రమ నిర్మాణం పేరుతో ముందస్తు నోటీసులు లేకుండా హైడ్రా కూల్చివేడయం బాధాకరమని మాజీ కేంద్రమంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. ప్రజాజీవితంలో స్వచ్ఛమైన రికార్డును కలిగి ఉన్న తమపై ఇలాంటి ఆరోపణలు రావడం బాధగా ఉందన్నారు. తన సోదరుడు ఆనంద్ 7 ఎకరాలు భూమి లీజుకు తీసుకొని స్పోర్ట్స్ వెంచర్ (ఆర్‌వోఆర్) ఏర్పాటు చేశారని, ఇందుకోసం తీసుకున్న అనుమతులను పరిగణనలోకి తీసుకోకుండా, నోటీసు లేకుండా కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్‌వోఆర్ 2015 నుంచి పనిచేస్తున్నదని, ఆనంద్ కష్టపడి సంపాందించిన డబ్బులతో దీన్ని ఏర్పాటు చేశారని పల్లంరాజు ఎక్స్‌లో పోస్టు చేశారు.









# ..సౌధాలు కట్టి!

మొదటిపేజీ తరువాయి...

ఉన్న ప్రాంతాన్నే ఎఫ్‌టీఎల్‌గా భ్రమింపజేస్తూ తమ నిర్మాణాలకు ఎఫ్‌టీఎల్ దూరంగా ఉన్నదంటూ సదరు నేతలు ప్రకటనలు చేస్తున్నారు. మంత్రి పొంగులేటి ఒకడుగు ముందుకేసి 'కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి! ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే కూల్చుకోండి!' అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. మరి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ గుట్టును గూగులమ్మ తల్లి రట్టు చేసింది. ఇదంతా ఒకెత్తయితే జలమండలి మెమో ప్రకారం అర కిలోమీటర్ ఉత్తర్వులు అలాగే ఉన్నాయి. పైపెచ్చు భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన జీవో 168 కూడా ఇంకా అమల్లోనే ఉన్నది. ఇక సవాళ్లు, ప్రతి సవాళ్లకు తావెక్కడ? నిగ్గు తేల్చాల్సింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే! దాని కనుసన్నల్లో నడుస్తున్న హైడ్రానే!

**ఫొటో-1**

*హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించి 2011 గూగుల్ మ్యాప్ ఇది. 2011 ఫిబ్రవరిలో జలాశయంలో ఒడ్డు (17*20'47.89"N-లాంగిట్యూడ్, 78*21'33.35"E - లాటిట్యూడ్) వద్ద ఉన్నది. అది ఫిబ్రవరి కావడంతో వానకాలంలో ఎగువ నుంచి వరద వస్తే ఇంకా నీటి నిల్వ పెరిగి ఒడ్డు ముందుకు వస్తుంది. అంటే ఎఫ్‌టీఎల్ ఇంకా ముందుకు జరుగుతుంది. ఆ సమయంలో ఎఫ్‌టీఎల్‌కు కొంత దూరంలో నామమాత్రపు నిర్మాణాలు కనిపిస్తున్నాయి.*

**ఫొటో-2**

ఇదీ హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించి ఈ ఏడాది మార్చి గూగుల్ మ్యాప్. జలాశయం ఒడ్డు చాలా కుచించుకుపోయింది. 2011 ఫిబ్రవరిలో కనిపిస్తున్న దరి (లాంగిట్యూడ్, లాటిట్యూడ్)ని మార్క్ చేస్తే సరిగ్గా మ్యాప్‌లో కనిపిస్తున్న నిర్మాణాల దగ్గరకు వచ్చింది. అంటే 2011లో అక్కడి వరకు జలాశయంలో నీళ్లున్నాయన్న మాట! దాని ప్రకారం జలాశయం పూర్తిస్థాయి నిల్వకు చేరుకుంటే నీళ్లు ఇంకా ముందుకు నిర్మాణాలను దాటి పోతాయి. అంటే కచ్చితంగా ఆ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ లోపలో, అంచునో ఉన్నాయనేది గూగులమ్మ విప్పిన గుట్టు! ఇక బఫర్‌జోన్ అంటారా?.. అందులో సందేహమే లేదు. ఇంతకీ ఆ నిర్మాణాలు ఎవరివో తెలుసు కదా! సాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుడికి సంబంధించిన గృహాలు.

**ఫొటో-3**

*ఇది కూడా 2011, ఫిబ్రవరిలో హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించిన మ్యాప్. ఇందులో అప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు జలాశయం చెంతన కొలువుదీరారు. గెస్ట్‌హౌస్‌కు అనంతం అని నామకరణం కూడా చేసుకున్నారు. దాని పక్కనే అనన్య పేరిట మరో గెస్ట్‌హౌస్ కూడా కనిపిస్తుంది. అది కూడా ఒక రాజకీయ ప్రముఖుడిదేనన్న ప్రచారం ఉన్నది. అప్పట్లో కేవలం రెండు గెస్ట్‌హౌస్‌ల్లో ఒకటి చొప్పున నిర్మాణం ఉన్నది. జలాశయం ఎఫ్‌టీఎల్ కూడా దూరంగా కనిపిస్తుంది.*

**ఫొటో-4**

ఇది ఈ ఏడాది మార్చిలో అనంతం, అనన్య గెస్ట్‌హౌస్‌లకు సంబంధించిన గూగుల్ మ్యాప్. రెండు చోట్లా భారీ నిర్మాణాలు పెరిగిపోయాయి. నివాస సముదాయాలతో పాటు గార్డెనింగ్ కోసం చేపట్టిన పనుల్లో పెద్ద ఎత్తున కాంక్రీట్ పనులు కూడా చేశారు. మరోవైపు హిమాయత్‌సాగర్ జలాశయం ఈ నిర్మాణాలకు వణికి వెనక్కి పోయింది. ఈ రెండు మ్యాప్‌లు కూడా జలాశయానికి వరదలేని సమయాల్లో (అన్‌సీజన్) తీసుకున్నవి. పూర్తిస్థాయి నీటి నిల్వ సమయంలో కచ్చితంగా దరి ఇంకా ముందుకు ఉంటుంది. ఇవీ.. హిమాయత్‌సాగర్ నోట్లో మట్టి కొట్టిన తీరు!

సూరం చెరువు



# హైడ్రా.. ఇటు చూడు

మొదటిపేజీ తరువాయి...

దిగిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి!. అందుకే తొలుత ఈ ప్రాజెక్టుకు 'కేఎల్‌ఆర్ గిగా' అని, తర్వాత 'వర్టెక్స్-కేఎల్‌ఆర్ గిగా సిటీ' అని పేరు పెట్టారు. ఏండ్ల కింద కష్టపడి కట్టుకున్న పేదోళ్ల గూడుపైకి బుల్డోజర్లను పంపిస్తున్న హైడ్రా, మరి చెరువును ఆనుకొనే ఉన్న ఈ వెంచర్ వైపు ఎందుకు చూడడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వరదకూ అడ్డం!**

రంగారెడ్డి జిల్లా మంఖాల్ రెవెన్యూ గ్రామ పరిధిలో సూరం చెరువు అలియాస్ సూరారావు చెరువు ఉన్నది. సర్వేనంబరు 139లో 40.20 ఎకరాలు, 140లో 20.12 ఎకరాలు మొత్తం 60.32 ఎకరాల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉండేది. ఎగువన శంషాబాద్, పహాడీ షరీఫ్ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి ఈ చెరువులో చేరుతుంది. చెరువు సమీపంలో నాలుగైదేండ్ల కిందట రియల్ వెంచర్ రూపుదిద్దుకున్నది. కేఎల్‌ఆర్ గిగా సిటీ పేరుతో మొదలైన ఈ వెంచర్ క్రమంగా చెరువు వైపు విస్తరించింది. వరద వచ్చే మార్గాన్ని సైతం నియంత్రించేలా నిర్మాణాలు వెలిశాయి. వెంచర్‌లో మధ్యలోంచి ఉన్న ఈ మార్గంలో తొలుత సిమెంటు పైపులు వేశారు. గ్రామస్తులు నిలదీయడంతో చివరికి డ్రెయిన్ బాక్సులు నిర్మించారు. కానీ ఆ మార్గాన్ని పూర్తిగా చెరువు వరకు నిర్మించలేదు. దీంతో వరద చెరువులోకి వెళ్లడం ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు 60.32 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు ప్రస్తుతం సగమే ఉన్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. చెరువు భూమిని వెంచర్‌లోకి మలుపుకొన్నారని ఆరోపిస్తున్నారు.

**నోరెత్తని నీటిపారుదల శాఖ**

సూరం చెరువు దుస్థితిపై నీటిపారుదల శాఖ డీఈఈ బీడీ నాయక్‌ను సంప్రదించగా చెరువులన్నింటినీ సర్వే చేసి, ఎఫ్‌టీఎల్‌ను కూడా గుర్తించామని చెప్పారు. కానీ, సూరం చెరువు ఐడీని వెల్లడించమంటే ప్రస్తుతం తన దగ్గర అందుబాటులో లేదన్నారు. ఆపై ఆ అధికారి ఫోనెత్తడమే మానేశారు. నీటిపారుదల శాఖ రికార్డులను పరిశీలిస్తే అధికారుల లీలలు బయటపడ్డాయి. 139, 140 సర్వే నంబర్లలో సూరం చెరువు 60.32 ఎకరాల మేర విస్తరించి ఉన్నదని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నట్టు నీటిపారుదల శాఖ నివేదికలో ఉన్నది. కానీ ఎఫ్‌టీఎల్ ఏమైనా ఆక్రమణకు గురైందా? అనే కాలంలో మాత్రం అదేం లేదని నమోదు చేశారు. చెరువును ఆనుకొని కళ్లెదుటే నిర్మాణాలు కనిపిస్తున్నా ఆక్రమణలు లేవని పేర్కొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్ముందు ఈ ప్రాంతం మరింత ఆక్రమణకు గురికాకముందే చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, లేదంటే ఎగువ నుంచి వచ్చే వరద ఇతర ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదముందని స్థానికులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రంలో బుల్డోజర్‌రాజ్

- హైడ్రా కూల్చివేతలపై అనేక అనుమానాలు
- ఎంపిక చేసిన నిర్మాణాలపైనే కూల్చివేత: దాసోజు శ్రవణ్



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): చెరువు రక్షణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకానికి పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అనుసరించిన బుల్డోజర్ రాజ్‌ను తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. హైడ్రాపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేసి తమది పారదర్శకమైన ప్రభుత్వమని నిరూపించుకోవాలని సూచించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఆయన లేఖ రాశారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని రాంనగర్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రికి రాత్రే చేపట్టిన కూల్చివేతలపై ఆయన భగ్గుమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆ క్రమణలకు గురైన చెరువులు, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను ఎప్పటికప్పుడు వెల్లడించాలని తెలిపారు. ఎంపిక చేసిన నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నారనే అనుమానాలు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పూర్తి డేటా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్ కానివ్వద్దు

- ఖర్గేకు కేటీఆర్ సూచన
- పేదల ఇండ్లు కూల్చడంపై ఆవేదన
- మీరు సమర్థిస్తారా? అని ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మరో బుల్డోజర్ రాజ్ కాకుండా చూడాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఆ దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సూచించాలని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయత్నాన్ని సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. 'ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయలుగా మార్చడం అమానవీయం, అన్యాయం అని గతంలో మీరే అన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ వారిని నిరాశ్రయులు చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి?' అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 మంది పేదల ఇండ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన ఘటనను ఎక్స్ ద్వారా మల్లికార్జున్ ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చేసిన 75 ఇండ్లలో 25 కుటుంబాలు దివ్యాంగులకు చెందినవేనని ఆవేదన వ్యక్తం చేశారు. 20 నుంచి 40 ఏండ్ల క్రితం ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్న పేదలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేస్తుండడం అమానవీయమని పేర్కొన్నారు. తెలంగాణ మరో బుల్డోజర్ రాజ్ కాకుండా ఉండేందుకు ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలని ఖర్గేను కోరారు.

## పెద్దోళ్లను వదిలి పేదలపై పడ్తరా?



మొదటిపేజీ తరువాయి...

విమర్శించారు. కూల్చివేతలపై న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని, బీఆర్‌ఎస్ తరఫున న్యాయపరంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌లోని అంధుల కాలనీకి అర్ధరాత్రి 400 మంది పోలీసులు వెళ్లి ఇండ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సామగ్రి తీసుకునేందుకు సమయం ఇవ్వమని కోరినా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారని తెలిపారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి పట్టాలు ఇస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీళ్లు, కరెంటు ఇచ్చిందని వివరించారు. పింఛన్ డబ్బులతో వారు ఇండ్లు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. వారికి పట్టాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడ చెరువు లేదని, కుంట లేదని, కోట్ల విలువ చేసే భూమి కూడా కాదని, అయినప్పటికీ ఎందుకు కూల్చారని ప్రశ్నించారు.

**మానవీయ కోణంలో స్పందించాలి**

పేదల కోసం కాంగ్రెస్ ఎన్ని ఇండ్లు కట్టిందో తెలియదు కానీ, కట్టుకున్న ఇండ్లను మాత్రం కూల్చివేస్తున్నదని శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలన్నీ మానవీయ కోణంలో స్పందించాలని కోరారు. ఇండ్ల కూల్చివేతలో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. దివ్యాంగుల రూ. 4 వేల పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచుతామని ఇప్పటి వరకు పెంచలేదని విమర్శించారు. కూల్చివేతల విషయంలో పేదల తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి డబ్బులే కావాలనుకుంటే బిచ్చమెత్తి అయినా నిధులు సమకూరుస్తామని చెప్పారు. తాను ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలపై కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చొద్దు: తమ్మినేని

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జలవనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా ఆహ్వానించదగ్గదే అని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో 12 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 78 మంది దివ్యాంగులకు ఇళ్లపట్టాలు ఇవ్వగా వారు ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నారని, ఆక్రమణల పేరుతో గురువారం బుల్డోజర్లతో కూల్చివేయడంతో వారంతా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లోని హస్మత్‌పేట్, అల్వాల్‌లో పేదల ఇళ్లు నేలమట్టం చేశారని విమర్శించారు. ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పేరుతో పేదలను బజారుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.



టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ పవన్

## ఎల్బీనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు

హైదరాబాద్ (ఎల్బీనగర్), ఆగస్టు 30: ఎల్బీనగర్ పరిధి సరూర్‌నగర్‌లో మారుతీనగర్‌లో శుక్రవారం హైడ్రా అధికారులు ఓ భవనం కూల్చివేతకు ప్రయత్నించగా కార్పొరేటర్ పవన్‌కుమా ర్ అడ్డుకున్నారు. ఎల్బీనగర్ సర్కిల్‌లో 36 అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు 15 నిర్మాణాలను కూల్చారు. సరూర్‌నగర్ సర్కిల్‌లో 32 అక్రమ నిర్మాణాల్లో 12 నిర్మాణాలను నేలమట్టం చేశారు.



## మరో చేనేత యువకుడి ఆత్మహత్య

*దుబ్బాక, ఆగస్టు 30:* ఆర్థిక ఇబ్బందులతో చేనేత కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో చేనేత కార్మికుడు తుమ్మ రాజలింగం-సత్యవతి కుటుంబంతో నివసిస్తున్నారు. చేనేత పని లేకపోవడంతో రాజలింగం బీడీ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడి భార్య సత్యవతి బీడీ కార్మికురాలు. వీరి కుమారుడు తుమ్మ నవీన్ (29) సిద్దిపేటలో ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. నవీన్‌కు సిద్దిపేటకు చెందిన ఓ యువతితో నాలుగేండ్ల కిందట వివాహం జరిగింది. చాలీచాలని జీతంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో నవీన్ తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు దుబ్బాక పోలీసులు తెలిపారు.



- **ప్రాణం మీదికి తెచ్చిన సెల్ఫీ సరదా**

*నల్లగొండ జిల్లా వేములపల్లి సమీపంలో శుక్రవారం భర్త, తమ్ముడు, కూతురుతో కలిసి కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ మహిళ నాగార్జునసాగర్ ఎడమ కాల్వను చూసి ఆగింది. రైలింగ్ వద్ద సెల్ఫీ దిగుతుండగా పట్టుతప్పి కాల్వలో పడిపోయింది. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో పక్కనే ఉన్న గజలాపురం యువకులు జక్కా నాగయ్య, జక్కా నాగరాజు మహిళను కాపాడేందుకు కాల్వలో దూకారు. మరికొందరు పైనుంచి తాడు విసరడంతో ఆమెను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. ఆ మహిళ వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివరాలు తెలియరాలేదు. నాగయ్య, నాగరాజును స్థానికులు అభినందించారు.*



- **ప్రభుత్వ దవాఖానలో పశువులు**

*మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇలాకా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రభుత్వ దవాఖాన పశువులు, వీధి కుక్కలకు ఆవాసంగా మారింది. మహదేవ్‌పూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరిసరాలు అధ్వానంగా ఉండటంతో దవాఖాన లోపలికి పట్టపగలే పశువులు చేరుతున్నాయి.*

*-జయశంకర్ భూపాలపల్లి*




- **ఆర్టీసీ బస్సులు పెంచాలంటూ మహిళల ధర్నా**

*ప్రయాణికుల రద్దీని బట్టి ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టి నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. మహాలక్ష్మీ పథకంతో బస్సుల్లో రద్దీ పెరగడంతో ప్రయాణికులంతా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, రాజన్న, గంగామణి, కవిత, విజయ, వసంత, తస్రీన్ తదితరులు పాల్గొన్నారు.*



## డెంగ్యూ చికిత్సకు 25 లక్షలు పెట్టినా బతకలే!

సిద్దిపేట అర్బన్/పాపన్నపేట,ఆగస్టు *30:* ఉమ్మడి మెదక్ జిల్లాలో డెంగ్యూతో ఇద్దరు మృతి చెందారు. సిద్దిపేట జిల్లా తడ్కపల్లికి చెందిన సుతారి కనకలక్ష్మి(28)కి డెంగ్యూ వచ్చింది. సిద్దిపేట, హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించారు. దాదాపు 25 లక్షలు ఖర్చుపెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆరోగ్యం విషమించి గురువారం రాత్రి మృతిచెందారు.

**మెదక్ జిల్లాలో విద్యార్థి మృతి**

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామానికి చెందిన వడ్ల రాజు పెద్ద కొడుకు హర్షిత్ చారి (11) స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వారం క్రితం డెంగ్యూ బారినపడగా మెదక్, హైదరాబాద్‌లోని దవాఖానల్లో చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి దవాఖానలో మరణించాడు.